మానవాళిని వణికించిన విషాణు విజృంభణలో, దేశం మూసివేయబడ్డప్పుడు,
భయం గొలిపే నిశ్శబ్దపు చీకటి రాత్రుల్లో ఒంటరి తలపోత.
కాస్త మెటఫరికల్‌గా, కొంచెం వ్యక్తావ్యక్తంగా...

పాపినేని శివశంకర్

# 9 గబ్బిలం





ఎచటికి పోతావీ రాత్రి? ఈ రేయి దారి దొరకదు. ఎవరూ చెప్పరు. చెప్పటానికి ఎవరూ ఎదురు రారు. అసలు కంటికే కనపడరు. ఎలా తెలుసుకుంటావు? దిక్కులైనా తెలుస్తున్నాయా? ఇవాళ అమావాస్య. నిన్న కూడా అమావాస్యే. రేపు కూడా అమావాస్యే. ఇలా ఎన్ని రోజులైనా అమావాస్య రాత్రులే ఉంటాయేమో. చంద్రుడి పదహారు కళల్లో ఒక్క కళైనా కనపడదే. చంద్రకళ కనపడే అమావాస్య రాత్రిని 'సినీవాలి' అని కదా అంటారు? సినీవాలి కూడా కాని ఈ అమావాస్య రాత్రుల్ని, చుక్కల్లేని రాత్రుల్ని, ఇంత కటిక చీకటి రాత్రుల్ని ఎప్పుడూ చూడలేదు. ఎప్పుడూ.

'ఎలుతురంతా మేసి రేయి నెమరేసింది'. 'ఏరు' బదులు 'రేయి', అంతే. డైరీ రాస్తుంటే కవిత్వం తొంగి చూస్తుందేమిటి? బహుశః తాతయ్య తరంలో ఇంత చీకటి చూశారేమో. అవును, ఒకసారి తాత అన్నాడు, సరిగ్గా ఉక రాని చిన్నతనాన.

'అమాస అంటే చీకటిరా అబ్బాయ్! నేను నీ అంత ఉన్నప్పుడు వరసగా నలభై అమావాస్యలు.'

'అమ్మో! అమాస వరసగా ప్రతి రాత్రి వస్తదా తాతా?'

'వస్తదిరా. రొండు మూడు తరాలకి ఒకసారి ఇట్టాగే నిండు అమాసలు వస్తయ్యి. పున్నమలే ఉండవు. మడుసులంతా చీకటి రాత్రుల మంటల్లో మలమల మాడిపోవాల్సిందే.'

ఏ అదృశ్య సూక్ష్మజీవి విసిరింది ఈ చీకటి వలని, ఇంత చిక్కని వలని నా మీదా, నా వాళ్ల మీదా, ఈ మనుషులందరి మీదా? 'ఓ అమావాస్యా నిశీథినీ, గగన సీమంతినీ!'

**2**

వీథిలో ఏదో వాహనం, మైక్‌లో అరుస్తూ పోతూ. 'నల నల్లటి గబ్బిలం ఒక్కటి దారి తప్పి ఈ సీమకి వచ్చింది. కోరలూ కొమ్ముల్తో. దాని అరుపు మామూలుగా ఎవరికీ వినపడదు. వినపడితే మిను మిక్కిలి ప్రమాదం. అది తిరిగే నింగి దారులన్నీ మూసేస్తున్నాం. జాగ్రత్త జాగ్రత్త. ఎవరూ బయటికి రావద్దు. దాని బారిని పడొద్దు. ఎవరికైనా అది కనిపించినా, దాని అరుపు వినిపించినా తెలియజేయవలసిందిగా హెచ్చరించటమైనది. పారా హుషార్!'

నల నల్లటి గబ్బిలం! ఇంత చీకటిలో ఎక్కడ కనపడుతుంది? ఎవరు దాని జోలికి పోగలరు?

గబ్బిలం! ఎప్పుడో మహాకవి రాశాడు గదా కావ్యం? ఆ గబ్బిలం సందేశహారిణి. ఈ గబ్బిలం ప్రమాదకారిణి. మరి ప్రమోదకారిణి ఎక్కడ? గబ్బిలమా! దరికి రాబోకు, రాబోకు.

**3**

నలుపు, కారునలుపు. ఇంత నలుపు ఎప్పుడూ చూడలేదు. కారుమేఘం మించిన నలుపు. చీకటిని మించిన నలుపు. ఒకటే నలుపు. చిన్నప్పుడు డ్రాయింగ్‌లో నల్లరంగు పెన్సిల్‌తో చెట్లు చేమలు, రాళ్లు రప్పల్లాంటివి దిద్దేవాళ్లం. మూడు రంగుల జెండా బొమ్మ వేస్తే జెండా స్తంభానికి, దిమ్మెకి నల్లరంగే. అయితే ఏ రంగు కూడా దీని ముందు చాలదు.

అదేమిటి? దూరంగా, దగ్గరగా అన్ని యిళ్లకూ నల్లరంగే కనపడుతుంది. ఎప్పుడూ లేదు. పదిరోజుల కిందటి దాకా అన్ని యిళ్లూ వేర్వేరు రంగులతో ఉండేవే? ఆ మధ్య నాలుగిళ్ల అవతల వీధిలో కొత్తగా కట్టిన మేడ రంగురంగుల్తో మిస మిస లాడేది. కాని, యిప్పుడు ఆ యింటికీ అదే నల్ల రంగు. ఇంతలోనే ఎప్పుడు వేశారు? సాయంత్రమైంది కదా! కనుచీకటిలో సరిగ్గా కనపడకపోవచ్చు. రేపు పొద్దున్నే చూస్తే సరి.

అప్పుడే ఏడైంది. లేవాలి, లేవాలి. ఒక్క ఉదుటున లేచి వరండాలోకి పరుగు. అవును. ఆశ్చర్యం! చుట్టూ అన్ని ఇళ్లకీ నల్లరంగు. మా యింటికీ అదే రంగు. ఆవేశం, కోపం తన్నుకొస్తున్నాయి. నాకు తెలియకుండా, మాట మాత్రం అడక్కుండా మా యింటికి రంగు పులిమే అధికారం ఎవరిచ్చారు? ఒకవేళ వేసిరి పో, నల్లరంగే ఎందుకు వెయ్యవలె? ఐ హేటిట్. ఏ మాత్రం నచ్చదు. ఎవరు వేశారు? మనస్సంతా వికలమై.... సాయంత్రానికి ఆ నల్లరంగు మీద ఏవేవో రాతలు.

'జాగ్రత్త జాగ్రత్త. బయటికి రావొద్దు. రావద్దు బయటికి. ఇది రాజశాసనం.'.

నన్ను రావొద్దనటానికి వాళ్లెవరు? ఏమవుతుంది బయటికి వెళ్తే? ఎందుకో భయం. కానీ యీ నల్లరంగు నచ్చదు. అన్ని యిళ్లకీ అదే రంగు. ఆ నలుపు మీద అవే వాక్యాలు. 'బయటికి రావొద్దు.'

**4**

డుర్... ర్... ర్... ర్...

ఏమిటా ధ్వని? నిన్నటిదాకా వినపడలేదు. ఇప్పుడు కాస్త దూరంగా వినపడుతూ. ఎదురు వీధిలో మూలమీద పెద్ద భవంతిని ఏదో చేస్తున్నారు. పనిమనిషి చెప్పింది. (రేపటి నుంచి రానని కూడా చెప్పింది.)

డుర్... ర్... ర్...

ఏదో పెద్ద యంత్రం అక్కడ నిలబడ్డట్టు అర్థమవుతుంది. యంత్రం రగులుతోంది. ఏదో పగులుతోంది.

నలుగురైదుగురు ఉంటారు మేడలో. కట్టి పదేళ్లు అవుతుందేమో. ఇంతలోనే రిపేర్ వచ్చిందా? ఏదైనా అంతేనా? విధ్వంసమేనా? మేడైనా మనిషైనా?

థబ్... థబ్... థబ్...

యంత్రం రగులుతోంది. ఏదో పగులుతుంది. విరుగుతుంది. కూలుతుంది. గోడా? మేడా? వెళ్లి చూస్తే? అమ్మో! వెళ్లరాదు. చూడరాదు. ఏదైతే నాకేల? ఇదేదో ధ్వంసరచన. బయటి విధ్వంసం తెలుస్తుంది. కాని లోపల? లోలోపల? ఎవరూ కనపడరు. వినపడరు. ఒంటిమీద జిగటలా భయం. ఒంటరి మనిషి లోపల జరిగేది ఏ విధ్వంసం?

## 5

'పెరిగిపోయింది, పెరిగిపోయింది. గబ్బిలాల సంతానం బాగా పెరిగిపోయింది, పట్టపగలు కూడా ఎగురుతున్నాయి సుమా! గాలిపటాల్లాగా. ఇనుప డేగల్లాగా. ఎవ్వరూ దాని చూపుల బారిని పడవద్దు, వద్దు, పడవద్దు. పడిన వాళ్లది విషాదాంతం. జాగ్రత్త జాగ్రత్త. ఎవ్వరూ బయటికి రావద్దు. పారా హుషార్!'

వీథుల వెంట ఒకటే ప్రచారం. అవి చీకటిలోనే తిరుగుతుంటాయని, మనుషులు నివసించే చోటికి సాధారణంగా రావనీ చదివి ఉన్నాను. కానీ ఇదేమిటి? ఇంతలావు మనిషి గబ్బిలాలకి భయపడటమేమిటి? చీమలు మొదలు సింహాలదాకా ఎన్నిటిని మట్టుపెట్టలేదు? ఈ నగరవాసానికి వచ్చిన తొలి రోజుల్లో ఎన్ని పిచ్చికలు ఇక్కడ వాలేవి? ఇప్పుడు కనీసం చూద్దామన్నా ఒక్కటీ కనపడదు. మహాకవి చెపుతున్నాడు, 'సరిహద్దులు లేని సకల జగజ్జనులారా! మనుష్యుడే నా సంగీతం, మానవుడే నా సందేశం'. కవి నమ్మకం వమ్ము చేసి ఏ సందేశం ఇచ్చాడు మానవుడు? ఏది దారి? ఈసారి కనపడితే అడగాలి, అడగాలి.

మనిషీ మృగమూ కాని మూర్తి చేతుల్లో ఒక మహాబలశాలి హతమారిన సంగతి ప్రాచీనం. ఇప్పుడు పులుగూ మెకమూ కాని ఒక మూర్తి నిశ్శబ్ద ధ్వనితరంగ ప్రభంజనంలో మానవ హననం నవీనం.

## 6

ఎంతెంత దూరం? కోసెడు కోసెడు దూరం. నేను ఆ ఊరు వెళ్లటానికి లేదు. ఆమె ఈ ఊరు రావటానికీ లేదు. రోడ్లన్నీ మూసేశారు. దారులన్నీ మూసుకుపొయ్యాయి. దేశం దేశమే మూసుకుపోయింది. దేశానికి తాళం వేసేశారు. సరిహద్దుల్లో తాళాలు. విమానాలకి తాళాలు. మనుషుల కాళ్లకీ తాళాలు. తాళం చెవులు దాచిపెట్టారు. ఎవ్వరూ తాళాలు పగలగొట్టే వీలు లేదు. తప్పట్లోయ్! తాళాలోయ్!

'వెళ్లాల్సిందేనా?' అడిగాను సుమిత్రని, దారులు మూసుకుపోయే ముందు.

'సాయాన పెద్దమ్మ కదా? వారం నుంచి బాగోటం లేదంట. వయసు మీద పడిందాయె. పిల్లలేమో విదేశాల్లో. సుఖాల్లో పట్టించుకోవాల్సిన పని లేదు. కష్టాల్లోనే కావాలి గదా?'

కష్టాలు, కష్టాలు. ఊరికే రావు. వస్తే తేలిగ్గా పోవు. సొంత అల్లుడిలాగానే నన్ను చూసిన పెద్దత్త. పట్టించుకోకపోతే ఎట్లా? ఆ యింటికి ఈ యిల్లెంత దూరమో ఈ యింటికి ఆ యిల్లూ అంతే.

మౌనంగా తల ఊపగా వెళ్లిందామె. తోడుగా బాబు. వర్క్ ఫ్రమ్ హోమ్‌తో నేను కదల్లేక. దూరాభారం. భారం దూరం.

భౌతిక దూరమే కాదు, మానసిక దూరం తగ్గించటానికి కూడా సుదూరం వెళ్లింది సుమిత్ర. ఇంతలోనే దేశమంతా మూతబడింది. దూరం తగ్గించటానికి దూరం వెళ్లిన తను అట్లాగే దూరంగా ఉండాల్సిరావటమేమిటి? ఈ దూరాలు ఎప్పటికి తీరేను? ఏమో.

పెద్దత్త ఆరోగ్యం బాగా దెబ్బతిందని ఫోను. పిల్లలు వచ్చే అవకాశం లేదు. అన్నీ మూసేసిన పరిస్థితి. మనుషులే మనుషులకు కనపడని రోజులు. వెళ్లే వీలు లేదు. ఏం చెయ్యాలి?

ఎప్పుడు ఏం చెయ్యాలో ఒక్కోసారి కాలమే నిర్ణయిస్తుంది. ఒకరోజు తిరిగి రాని దూరాలకే వెళ్లింది పెద్దత్త. విదేశం నుంచి పిల్లలూ రాలేకపోవటం. ఒకటే బాధ. ఎంతగా మొగిసినా ఆ ఊరు వెళ్లలేక, కుదులుకొంటూ. జీవితంలో ఇంత నిస్సహాయత ఉంటుందా? ఇంత దుర్భరమైన కాలం ఉంటుందా? అన్నీ ఉండి మనిషి అనాథలాగా వెళ్లిపోవటం. ఎవర్ని నిందించాలి? నిందించటానికైనా ఎవరు కనపడతారు?

**7**

డుర్... డుర్... డుర్... ఢబ్... ఢబ్... డుర్... డుర్... ఢబ్...

ఒకటే మోత. ఎదురు వీథిలో ఆ పెద్ద భవంతి. లోపల లోపలే యంత్రం కూల్చేస్తుంది. కూలిపోతుంది. ఆకారం వికారమై పెద్ద దిబ్బ మిగులుతుంది. అక్కడ ఇంకేదో మెగా నిర్మాణం జరుగుతుందా? లేక శూన్యంగా మిగులుతుందా?

అన్నీ ఇంతేనా? ఇలాగే కరిగి, మరిగి, మలిగిపోతాయా? భవన నిర్మాణాలూ, మానవ నిర్మాణాలూ. డెబ్రీ. హ్యూమన్ డెబ్రీ. లోపల, బయట అంతా ఒక ధ్వంస రచన. 'హింసనచణ ధ్వంసరచన'.

'ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహములు'?

ఓ విధ్వంస వినోదినీ! నువ్వెక్కడ?

**8**

పదే పదే ఒకే కల రావటం ఆరోగ్యానికి మంచిదేనా? తెలీదు. హాంటింగ్ డ్రీమ్. రాదర్ హంటింగ్. ఏదైతేనేం? తిరిగి తిరిగి వెంటాడి, వేటాడేదే. అయితే ఇది

నా యౌవన ప్రారంభదినాల్లో పదే పదే వచ్చే కల లాంటిదైతే వేరు. ఆ కల అందమైన పేరుతో పుట్టింది. కలకి కూడా పేరా? ఎందుకుండగూడదు? మనుషులకు ఇన్నిన్ని అసలు పేర్లు, కొసరు పేర్లు, మారు పేర్లు, ముద్దు పేర్లు, మొద్దు పేర్లు- మనుషులకే ఏమిటి? కుక్కలకీ, పిల్లులకీ పేర్లుండగాలేంది, ఒకానొక అందమైన కలకి పేరుండటంలో తప్పేముంది? 'సుజాత' - ఆ కల పేరు! (మంచి పుటక గలది అని కదా అర్థం!) నేను కొండ ఎక్కుతూ - ఆమె కొండ దిగుతూ - ఇద్దరి మధ్యా ఏడు మెట్ల ఎడం. ఏడు మెట్ల పైయెత్తున వాన తుప్పరలా, మంచుతెరలా, తెలి మబ్బులా, తెలుపు, నీలం కలిసిన ఆకాశవర్ణ నేపథ్యంలో ఆమె - ఆకాశంలా ఆహ్లాదంలా ఆనందంలా ఆమె - ఇద్దరం అలాగే నిలబడి - ఇద్దరం ఒకరి కళ్లలోకి ఒకరు చూస్తూ- అంతే. కల ముగుస్తుంది. ఎన్నో సార్లు ఆ కల అలానే వస్తూ, పోతూ. అంతకు మించి దానికి మొదలు లేదు, కొనసాగింపూ లేదు. ఎన్నిసార్లు ఆమెని (కలలోనే) పలకరించాలని చూసినా మాటలు లేని మౌనగీతంగానే. అదే రూపం ఈ నేలమీద ఎక్కడైనా కనపడుతుందేమోనని ఎంత వెతికాను! ఎప్పుడూ ఎదురుపడకుండానే యౌవనం గడిచిపోయింది.

అందమైన ప్రదేశంలో, అందమైన మనుషుల్లో ఆహ్లాదం, ఆనందం తరంగాలై, తురంగాలై చెంగలించే స్వప్నాలైతే ఎన్నిసార్లు వచ్చినా సంతోషమే. అయితే హాయినుంచి జలదరింపుకి మారుతున్న ఈ కల వేరు. డెరిలియంలా, భీతిగొల్పుతూ, వెంటాడుతూ. భరించలేక, రాత్రి పూటే ఫ్యామిలీ డాక్టర్ దగ్గరికి. ఆశ్చర్యపోయాడు.

'ఇంత చీకటిలోనా? తెల్లారినాక రాకపొయ్యారా?'

'ఎప్పుడు తెల్లారుతుందో తెలీదు. అందుకని...'

నా సమస్య వివరించాను. 'నల్లటి రాత్రి. నేనెక్కడో ఏదో లోకంలో ఉంటాను. అది స్వర్గమో నరకమో. చీకటో వెలుతురో. అది భయమో, బాధో. అంతలో ఒక తెల తెల్లటి రూపం, ఆమె ఒకప్పటి నా ఊహల్లో అమ్మాయి సుజాతే అనుకుంటా. ఆమెను తాకేలోగానే అమాంతం మంచు మేఘంగా మారిపోతుంది. మంచుమేఘం తిరిగి నల్లగా మారిపోతుంది. అది నా చుట్టూ పైనా అదే పనిగా గీపెడుతుంది. ఆ అరుపు మరెవ్వరికీ వినపడదు. ఆ రూపం మరెవ్వరికీ కనపడదు. రోజూ అదే కల. అదే రూపం మార్చుకొంటున్న రూపం. ఎందుకు కనపడుతుందో, ఎలా మాయమవుతుందో తెలీదు. కల ముగిసినాక చూసుకుంటే ఒళ్లంతా చల్లబడి, అమ్మో! ఒళ్లు జలదరిస్తుంది. పదే పదే ఒకే కల రావటం ఏమిటి?'

డాక్టర్ నా తల అటూ ఇటూ తిప్పి చూశాడు. పైకి కిందికి కదిలించాడు. కళ్లు అటు ఇటు తిప్పమని పరీక్షించాడు. బహుశ మెదడులో నరాలకు సంబంధించి ఏదన్నా లోపం ఉందేమో అని తన అనుమానం రూల్ అవుట్ చేసుకున్నాడా?

'మీరు మానసికంగా సరిగానే ఉన్నారు. వేరే టెస్టులు అవసరం లేదు. కొన్ని కొన్ని మనం కలలనుకుంటాం. కాని అవి వాస్తవాలే. మీ 'కల' అనబడే వాస్తవంలో

తెలుపు, నలుపు ఆకారాలూ నిజమే. ఆ మొదటి ఆకారం మీరు ఇంతకుముందు చెప్పినదాన్నిబట్టి మీ ఊహాప్రేయసి అయ్యుండాలి. కాని ఆ రెండో ఆకారం సంగతేమిటో అర్థం కావటంలేదు. బహుశ అది కూడా స్పష్టమైన రోజున మీ కల ఆగిపోవచ్చు. అప్పటిదాకా ఓపిక పట్టండి'.

తేలిగ్గా నిద్ర పట్టేటందుకు కొన్ని మందు బిళ్లలు. అయినా నాకు ఇంకొంత భాగం అస్పష్టంగానే, అయోమయంలోనే. ఓ మై డ్రీమ్! మై అన్‌డియర్ డ్రీమ్!

ఇల్లు చేరేపాటికి రాత్రి అట్లాగే, నల్లగా కారుమేఘంలా, కాలసర్పంలా. సర్పములు కాటు వేయును.

## 9

'సహజీవనం అనే మాట కొత్తగా వినపడుతుంది' అన్నాడు మిత్రుడు భాస్కర్, మాటల కలయికలో. కలయికలన్నీ మొబైల్ ఫోన్‌లోనే. దాన్ని కనిపెట్టినవాడికి ధన్యవాదాలు.

'ఎప్పటినుంచో వింటున్న మాటే కదా? మన వాడు కనకారావు రెండేళ్లనుంచి ఆ అమ్మాయితో సహజీవనం చేయటం లేదా? పచ్చని కాపురం ఉరఫ్ పండంటి కాపురం'.

'పండు పుచ్చి రాలిపోయిందిలే' అన్నాడు తాపీగా. అర్థంకాలేదు. 'నీకింకా తెలీదా? అది మూన్నాళ్ల ముచ్చటే. తేడాలు వచ్చాయి.' అన్నాడు మళ్లీ.

ఆశ్చర్యం. ఈడు జోడు బాగుంది, మేడ్ ఫర్ ఈచ్ అదర్ అని వాళ్లే అనివార్యంగా అనిపించారు అందరితో. హోటల్ కాంటినెంటల్‌లో రెండేళ్ల కిందట పెద్ద పార్టీ. ఇద్దరూ ఒకే గొంతుకతో తామిద్దరూ సహజీవులం అని ప్రకటించింది వాళ్లే. ఇంతలో ఏమైంది?

'ఈ సహజీవనాలు ఎప్పటికప్పుడేలే. పెళ్లి అనే గట్టి ముడి లేకుంటే ఇట్లాగే ఏడుస్తాయి' అన్నాడు భాస్కర్.

ఇంతకీ ఏమిటి విషయం? అటు మొన్నటి రాత్రి ఆమె మీద నల్లటి నీడ పడింది. ఏదో కూత విన్పించింది. అంతే, అతను సహజీవనానికి విడాకులిచ్చి, అర్జంటు పనిమీద ఎక్కడికో వెళ్లి తిరిగి రాలా.

మిత్రుడి మాట. 'ఒకానొక విషాణువుతో సహజీవనం చెయ్యక తప్పదని ఇప్పుడు వినపడుతుంది. అదృశ్యంతో సహజీవనం ఎలాగో తెలీటం లేదు. ప్రకృతితో సహజీవనం చేసిన పూర్వాధునిక సమాజం దానినుంచే దేన్నైనా తట్టుకోగల శక్తిని పొందింది. మనం కోల్పోయాం.'

మళ్లీ అన్నాడు. 'మరణభయంలో కొట్టుమిట్టాడుతున్నాం. నువ్వు చూశావా? మన కళ్లముందు చీమకి, ఎదురుగా వీధిలో కుక్కకీ, పశువుకీ పక్షికీ లేని భయం, ఇప్పుడు కేవలం ఒక్క మనిషికే. ఎంత విచిత్రం!'

ఎన్నడో తాత చెప్పిన సంగతి. ఇలాగే ఏదో విషాణువు ఊళ్లోకి వచ్చినప్పుడు ఎదుర్కొని, దాన్ని వేపాకు మండల్తో ఎలా పారదోలిందీ చెప్పాడు. ఒంటి మీద దాని గోళ్ల గుర్తులు కూడా చూపించాడు. తొంభై ఏళ్లకి తను దాటిపొయ్యేదాకా కనీసం జలుబు, దగ్గు ఎరగడు. తాతలు, నాన్నలు దేనితో సహజీవనం చేశారు? మట్టితోనే కదా? చెట్లు చేమలు, పశువులు, పక్షులు - వాటితోనే కదా? వాటినుంచే వాళ్లకు శక్తి లభించింది. 'మట్టి మన తల్లి' అన్నాడు తాత. పొలం దున్నటానికి వేపచెట్టు అడ్డం వస్తుందని జీతగాడు కొట్టెయ్యబోతే గయ్యిమని అంతెత్తున లేచాడు. 'యాపచెట్టును కొట్టగూడదురా' అన్నాడు. నేను నేర్చిన చదువు - ఆ చెట్టు ఒకానొక విషాణు విజృంభణ నుంచి మనుషుల్ని కాపాడుతుందని సహజీవన రహస్యం చెప్పని చదువు - అది మూఢ విశ్వాసమని చెప్పింది. అసలు చదువే ఒక మూఢవిశ్వాసం కాదా? తెలిసిన అణువే సమస్తమని, సమగ్రమని తలచే, వలచే మూఢ విశ్వాసం.

స్నేహితుడన్నాడు, 'ఉయ్ హావ్ టు అన్‌లెర్న్. ఉయ్ హావ్ టు నో ద సైన్స్ ఆఫ్ అన్‌లెర్నింగ్.'

ఇప్పుడు ఈ నగరారణ్యంలో, బోన్సాయ్‌మొక్కలు తప్ప మహావృక్షాలు కనపడని చోట, పక్షులు ఎగరని చోట, పశువులు తిరగనిచోట దేనితో సహజీవనం? దేనితో?

'మిత్రుడా! నువ్వన్నది నిజం'.

## 10

వాసనలు, వాసనలు. జీవితాంతం వదిలిపెట్టని వాసనలు. చిన్నప్పుడు ఇంటి ముందు పొన్నాయి చెట్టు శీతాకాలంలో గుత్తులు గుత్తులుగా పూసినప్పుడు. ఏమి సువాసన! దనియాల చేను పూతమీదున్నప్పుడు గాల్లో తేలుతూ వచ్చే కమ్మటి వాసన. ఇప్పుడు? ఈ నగరంలో సరికొత్త మురుగు వాసనలు. ముక్కిపోయిన వాసనలు. నక్కిన వాసనలు. నటనల వాసనలు. ఏ పరామర్శ కోసమో ఐ.సి.యు. వార్డులోకి వెళితే భరించలేని వాసన. నాలుగిళ్ల అవతల కారు కింద పడ్డ కుక్కపిల్లదీ తెమిలే వాసన. ఇప్పుడూ అదే కడుపులో తెమిలే వాసన. వీధి చివరి నుంచి. ఎప్పుడూ లేదు. దేనినుంచో తెలియదు. ఎవరూ చెప్పరు. చెప్పటానికి ఎవరూ కనపడరు.

పొరుగాయన ఫోను. వీధి చివర పెద్ద మేడ నుంచి గాల్లో తేలుతూ ఏవో ఎక్కిళ్లు వినపడుతున్నాయని. ఎక్కిళ్లు ఎందుకొస్తాయి? అన్నవాహికకి ఏదైనా అడ్డం పడ్డప్పుడు. కళ్ల వెంట కన్నీళ్లు కారేటప్పుడు గూడా వెక్కుతూ వెక్కుతూ అవే. ఆ ఎక్కిళ్లే. ఎవరివి? ఆమెవేనా? ఎందుకు? తెలుసుకోవటానికి అక్కడిదాకా వెళ్లాలా? వెళ్లగలనా? ఒళ్లు జలదరింపు. అలాగే ఆలోచిస్తూ.

మూడంతస్తుల అద్దాల మేడ. అద్దాలమేడలో ఒంటరి అందాలభామ. ఒంటరి మరియు తుంటరి అని వదంతి. ఎప్పుడైనా కార్లో వెళుతూ తప్ప బయట పెద్దగా కన పడదు. ఎంతమంది వీధిని వెళుతూ వెళుతూ అద్దాల మేడవంక, అందలి అందాల

భామవంక చూపులూ మనసూ పారేసుకోలేదు? 'మేడలోని అల పైడిబొమ్మ'కి ఏమై ఉంటుంది? కారాదు, కారాదు. వీధిని పొయ్యేవాళ్లు ఉసూరుమనరాదు.

గంట తర్వాత ఏదో వ్యాను చప్పుడు, మా వీధిలోనే. ఒకటే హడావుడి. అదుగో వ్యాను పోతోంది, మా యింటి పక్కనుంచే. అవే ఎక్కిళ్లు. లోపల్లోపల కుదులు కుంటున్నట్టు, కుములుతున్నట్టు, ఎవరికీ చెప్పలేని, ఏమీ అడగలేని నిస్సహాయతతో కుళ్లుతున్నట్టు. కిటికీలో నుంచి చూస్తే వ్యాను అద్దాల వెనక ఆ చెదిరిన రూపం. అందాలభామదే. అప్పుడు మేడ అద్దాల వెనక. ఇప్పుడు వ్యాను అద్దాల వెనక. వ్యాను మీద కనపడే అక్షరాలు అవేనా? 'క్వారం...' సరిగ్గా చూసేలోపే దాటిపోయింది. తిరిగి ప్రాణసమేతంగా వస్తుందా? ప్రాణరహితంగా వస్తుందా? వ్యాను వెంటే అంతు పట్టని వాసన. మృత్యువు అదే వాసనేస్తుందా? కావచ్చు, కావచ్చు.

వ్యాను తిరిగి రాలేదు. అందమూ ప్రాణమూ రాలేదు. రాబోదు. కవి అంటున్నాడు. 'అంతము లేని యీ భువనమంత పురాతన పాంథశాల... కొంత సుఖించి పోయిరెటకో...'

## 11

మిత్రుడి ఫోను మోగటం లేదు. మోగినా తియ్యటం లేదు. ఏమైందో తెలీదు. వినలేక, కనలేక, కలవలేక. రెడ్ జోన్. అడుగు పెట్టరాదు.

సలసలలాడుతూ కాలం. ఇది అసంఖ్యాక మానవ సమూహాల్ని అవలీలగా విభాగించి ఒక్కొక్క చీకటిదీవిగా మిగిల్చిందా? స్వీయకేంద్రమై తనను తప్ప సమస్తాన్నీ దుంపనాశనం చేసిన మానవకోటి చిట్టచివరి స్క్వేర్ రూట్ తెలిపిందా? దినపత్రిక మృత్యువాసన. టీవీ తెర మృత్యువాసన. రోజు రోజుకీ వాసనలు అసంఖ్యాకం అవుతూ. ఇప్పుడు పదకొండు లక్షల పదకొండు వేల నూట పదకొండు సంఖ్యనైనా ఒక్కొక్క నిలువెత్తు మృతదేహంగా లెక్కించవచ్చు.

'లేవు శరత్తమస్వినులు, లేవు మనోజ్ఞ సుధాంశు మాలికల్'. లేవు తుది యాత్రలు, బంధు మిత్ర పరివారములు. లేవు శవపేటికలు. కలవు తరలించు ట్రాక్టర్లు, ప్రొక్లెయిన్లు. ప్లాస్టిక్ సంచులలో శవములతో వాహన సహజీవన / మరణ యాత్రలు. గోతులలో సామూహిక ఖననములు. 'దుర్వ్రతి. దుర్గతి. దుర్మతి. దుర్మృతి'. మహాకవి చెపుతున్నాడు.

*ఇది పిశాచులతో నిటాలేక్షణుండు*
*గజ్జె కదలించి యాడు రంగస్థలంబు*
*ఇది మరణదూత తీక్ష్ణమౌ దృష్టులొలయ*
*అవని పాలించు భస్మ సింహాసనంబు*

విధి ముందు నిస్సహాయ పిపీలికం నరుడు. ఒంటరి ద్వీపంలో, 'శోక భీకర తిమిర లోకైక పతి' నరుడు.

నిర్లిప్త సాక్షీభూతుడు దేవుడు.

## 12

వెన్నెల లేని, ఎప్పటికీ చంద్రుడు కానరాని చీకటి రాత్రి. తగలబడే అడవిలా రాత్రి. పగలబడే రాక్షసిలా రాత్రి. జుట్టు విరబోసిన వీపింగ్ విల్లోలా రాత్రి.

మందు బిళ్ల వేసుకోవటాన తొందరగా నిద్ర. నిద్రలో మళ్లీ అదే అలలాంటి కల. అలలో కల. కలకలం రేపే కల. హాంటింగ్ డ్రీమ్. తెల తెల్లటి అందమైన ఆకారం నా దగ్గరికి వస్తూ.

'సు-జాత'!

కౌగిలించుకోబోతే మారిపోయి, మంచు మేఘమై. అదీ మాయమై అక్కడ ఒకానొక నల నల్లటి రూపం.

ఓహో రూపాతీత రూపిణీ! ఎవరు నువ్వు? నీకు నేనేమిటి? ఎక్కడనుంచి నీ రాక? ఎనభై లక్షల జీవరాశుల్ని వదిలి నా దగ్గరికే ఎందుకు? ఎందుకు? నువ్వసలెందుకు? ఏమిటీ అనివార్యత?


కొంచెం కొంచెంగా మెలకువ. ఒళ్లంతా వేడి. నీరసం. నిద్ర మత్తులోనే మెల్లగా కొద్దిగా కళ్లు తెరిచి....

గదిలో పై కప్పుకి కాస్త కిందగా ఒక నల్లటి చిట్టి ఆకారం. గాల్లోనే గదంతా గిరికీలు కొడుతూ. ఒంటి మీద నీడ పడుతుంది. కూత వినపడుతుంది. మందంగా, మంద్రంగా. సంద్రంగా, నిస్తంద్రంగా....

గబ్బిలమా! ఓహో గబ్బిలమా!!

*సాక్షి ఫన్ డే*
*27 సెప్టెంబర్ 2020*

❋



**పాపినేని శివశంకర్** 6 నవంబర్ 1953న గుంటూరు జిల్లా నెక్కల్లులో జన్మించారు. వీరి మొదటి కథ *కలుపు మొక్క* 1977లో *ప్రజాతంత్ర* వారపత్రికలో అచ్చయ్యింది. *మట్టిగుండె, సగం తెరిచిన తలుపు* కథా సంపుటాలు, ఆరు కవితా సంపుటాలు, ఆరు విమర్శనా సంపుటాలు, ఒక పరిశోధనా గ్రంథం, ప్రాచీన పద్య విశ్లేషణా గ్రంథం ప్రచురించారు. *విస్తృత* కథకు ప్రధాన సంపాదకులు. *రజనీగంధ* కవితా సంపుటానికి 2016లో కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు లభించింది.

***చిరునామా: 3/6, విద్యానగర్, గుంటూరు-522007***
***ఫోన్ : 85008 84400*** **papineni22@gmail.com**